
కథ

# మంచిమాట నేర్చుకో

—ముద్దంశెట్టి హనుమంతరావు



సూర్యుడు నడినెత్తిన వున్నాడు. ఎండ నిప్పులు చెరుగుతోంది. వడగాడ్పులు వీస్తున్నాయి. ఆ ఎండలో రమణ దంపతులు ఆటో కోసం రోడ్డు పక్కనే వేచి వున్నారు. ఆటో స్టాండుకి వెళ్ళాలంటే కాస్తంత దూరం నడవాలి. ఆ ఎండలో నడవడానికి భయపడే ఇక్కడ నిల్చున్నారు.

ఖాళీ ఆటో ఒకటి వస్తూ వుంటే ప్రాణం లేచి వచ్చినట్టయింది.

"వస్తావా బాబూ!" సౌమ్యంగావే అడిగాడు రమణ.

"రావడానికే కదండీ ఆటో నడువుతున్నాను!" తల తిక్క సమాధానం చెప్పాడు ఆటోడ్రైవరు నిరంజన్.

రమణ ఆశ్చర్యపోయాడు ఆ డ్రైవరు సమాధానానికి. ఓ పొడినవ్వు నవ్వుకున్నాడు.

"మీటరు వెయ్యి బాబూ" అన్నాడు రమణ.

"మీటరు పాడయ్యిందండీ. ఎక్కడికి వెళ్ళాలి?"

"కలెక్టరాఫీసు దగ్గర దిగుతాం".

"పాతిక రూపాయిలివ్వండి".

"ఈ మధ్యనే కదా, మీటర్లు సీల్ చేశారు. అప్పుడే పాడయ్యిందా?" అన్నాడు రమణ ఆశ్చర్యంగా.

నిరంజన్ చిన్న నవ్వు నవ్వేడు.

"మనుషులే పాడైపోతున్నారండీ. మిషన్లు ఒక లెక్కా? పాడయ్యింది. ఏం చేస్తాం? ఆటోలో వెళ్ళాలంటే పాతిక ఇవ్వండి" నిర్లక్ష్య ధోరణిలో అన్నాడు నిరంజన్.

రమణ భార్య రాధిక కంగారు పడింది. ఆటో డ్రైవరు నిర్లక్ష్య ధోరణి భర్తని కవ్విస్తే, ఆయన అతడితో వాగ్వివాదానికి దిగడాన్ని గతంలో ఎన్నోసార్లు జరిగింది. అందుకే కంగారుగా భర్తకేసి చూసింది.

"మరో ఆటో చూసుకుందాం లెండి, అతణ్ణి వెళ్ళనివ్వండి" అంది.

రమణ ఆరోజు మంచి మూడ్‌లో వున్నట్టున్నాడు. వివాదంలోకి దిగలేదు. ఆటో మీటరు చెడిపోతే దాన్ని సరి చేయించేవరకూ ఆ ఆటోని నడపనివ్వకుండా నియంత్రిస్తే ఎంత బావుండేది? కాని అవన్నీ పరిశీలించే నాథులేరీ? అనుకున్నాడు రమణ.

"సరేలే బాబూ, నువ్వెళ్ళు. మీటరున్న ఆటోయే చూసుకుంటాం" అన్నాడు రమణ.

నిరంజన్ మొహంలో రంగు మారింది.

"ఇంతసేపు నన్ను నిలబెట్టారు. దానికి డబ్బులు ఎవరిస్తారండీ?" విసురుగా అన్నాడు.

"బేరం కుదరకపోతే ఏంజేస్తాం? నువ్వు ఎంత చెబితే అంత ఇచ్చేయమంటావా?" రమణ సమాధానం.

"ఇవ్వాలండీ. మేం వూరికనే అడగలేదు కదా? పెట్రోలు ధర ఎలా పెరిగిందో మీకు తెలీదా? ఔనులెండి. ఎట్లా తెలుస్తుంది లెండి! స్కూటరు కూడా లేనట్టుంది మీకు!" వెటకారంగా అన్నాడు నిరంజన్.

రమణకి ఒళ్ళు మండింది. డ్రైవరు మాటలు అతని ఆత్మాభిమానాన్ని వెక్కిరించినట్టనిపించింది.

"నాకు స్కూటరు వుందో, లేదో నీకు అనవసరం. నువ్వు అడిగినంత బాడుగ ఇచ్చేయాలని రూలెక్కడుంది? మేం కలెక్టరాఫీసు దగ్గరికి ఎన్నో పర్యాయాలు ఆటోలో వెళ్ళాం. పదిహేను రూపాయిలే ఇచ్చాం. అంతకంటే అదనంగా ఒక్క పైసా అయినా ఇవ్వను. ఇష్టముంటే రావొచ్చు. కష్టమనుకుంటే వెళ్ళిపోవచ్చు" నిష్కర్షగా చెప్పాడు రమణ.

నిరంజన్ అదోలాంటి చూపు చూశాడు రమణకేసి.

"అసలు, మీకు ఆటో ఎక్కే అలవాటు వుందా అని? అపాటి దానికి ఆటో కోసం నిల్చోవడం ఎందుకంట?" అన్నాడు తలపొగరుగా.

రమణ అంతరంగంలో ఎక్కడో చురుక్కుమంది. ఒక ఆటో కార్మికుడిగా ఆ డ్రైవరు ఆ విధంగా తనని అవమానించినందుకు ఎంతో బాధ పడ్డాడు. కార్మికుల్లో క్రమశిక్షణ లోపిస్తే ఆ వర్గం పురోగమించదని అతనికి తెలుసు. ఎందుకంటే, అతను పనిచేసే సంస్థలోని యూనియన్‌కి కార్యదర్శి అతనే. తనలాంటి కార్మిక ప్రతినిధినే ఆ డ్రైవరు అవమానిస్తున్నందుకు అతనిలో సహనం నశించింది. తను ఓర్పు వహించి పూరుకున్న కొద్దీ ఆటో డ్రైవరు రెచ్చిపోయి తనని పరిహసిస్తున్నందుకు అతని ఆత్మాభిమానం దెబ్బతింది. అతని మొహం క్రమంగా ఎర్రబడుతోంది.

పరిస్థితి జటిలమై పోతున్నందుకు రాధిక కంగారు పడింది.

"అతనితో ఎందుకండీ వాదన? ఆటోలే దొరక్కపోతాయా? మరో ఆటో చూసుకుందాం. కదలండి ఇక్కణ్ణించి!" అంది రాధిక అక్కణ్ణించి బైటపడాలనుకుని.

అయితే రమణ ఆలోచన వేరుగా వుంది. ఆవేశం వస్తున్నా, నిగ్రహించుకున్నాడు. సమయస్ఫూర్తితో వ్యవహరించాలనుకున్నాడు. ఆ ఆటో డ్రైవరుకి తగిన రీతిలో బుద్ధి చెప్పాలనుకున్నాడు.

"చూడు బాబూ! ఆటో కార్మికుడిగా నువ్విలా మమ్మల్ని పరిహసించకూడదు. నీలాగే ఆటో డ్రైవర్లందరూ ప్రవర్తిస్తే నగరంలో ఇన్ని ఆటోలు తిరగవు. మంచిగా మాట్లాడు బాబూ! మీలో ఎంతోమంది మంచివాళ్ళున్నారు. వారిని చూసైనా నేర్చుకో! నీ జీవన భృతి కోసం నువ్వు ఆటో నడుపుకుంటున్నావు. మా అవసరానికి మేం ఆటోలో ప్రయాణం చేస్తాం. ఇద్దరివీ అవసరాలే. మాకు స్కూటరుందో లేదో, అది నీకు అనవసరం. ప్రస్తుతం అవసరం మాది గాబట్టి నువ్వు అడిగిన ఆ పాతికా ఇవ్వాల్సిందే మరి. పద భాబూ! ఆ పాతికే ఇస్తాను. లేకపోతే మాకు అసలు ఆటో స్వరూపమే




తెలీదన్నా అంటావు. పోనీయ్" అంటూ భార్యతో పాటు ఎక్కి ఆటోలో కూర్చున్నాడు రమణ వ్యంగ్య ధోరణిలో.

రాధిక ఆశ్చర్యపోయింది భర్త అంత సులువుగా రాజీ పడినందుకు. అన్యాయాన్ని ఆయన జీర్ణించుకోలేరని ఆమెకి తెలుసు. అయితే, మరిప్పుడు ఎందుకు రాజీ పడినట్టు? ఆమెకి అర్థం కాలేదు. భర్త కేసి పరికించింది. ఆయన మొహంలో ఎటువంటి ఉద్రేకమూ గోచరించలేదు.

నిరంజన్ విజయం సాధించిన వాడిలా చిరునవ్వు నవ్వేడు.

"అదీ! లా దారికి రండి" అన్నాడు విజయగర్వంతో.

రమణ మౌనంగా వుండిపోయాడు. ఆటో కదిలింది. నిరంజన్ కూని రాగాలు తీస్తున్నాడు.

జంక్షనొచ్చింది. రెడ్ సిగ్నల్ వుండటం వల్ల, వాహనాలన్నీ ఆగిపోయినయ్. అవతలి వేపు ఓ పక్కగా ఇన్‌స్పెక్టరు, ఓ పోలీసు మాట్లాడుకుంటూ వుండటాన్ని గమనించాడు రమణ.

గ్రీన్ సిగ్నల్ రాగానే మిగతా వాహనాలతో పాటు రమణ దంపతులు కూచున్న ఆటో కూడా కదిలింది. ఇన్‌స్పెక్టరు దగ్గరికి రాగానే డ్రైవర్ని ఆటో ఆపమన్నాడు రమణ.

"ఎందుకూ?" విసురుగానే అన్నాడు ఆటో డ్రైవరు.

"ఆపవయ్యా, స్నేహితుడితో మాట్లాడాలా!" కోపంగానే అన్నాడు రమణ.

నిరంజన్‌కి ఆటో ఆపక తప్పలేదు. రమణ ఆటో దిగి-

"ఇన్‌స్పెక్టరు గారూ! ఓసారి దయచేసి వస్తారా?" అన్నాడు.

ఇన్‌స్పెక్టరు ఆటో దగ్గరికి వచ్చాడు. ఆటో డ్రైవరు నిరంజన్ ఓ నమస్కారం పారేశాడు.

"చెప్పండి" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"మీటరు లేకుండా ఆటో డ్రైవరు ఇష్టం వచ్చినట్టు బాడుగ అడుగుతూ వుంటే, అతను అడిగినంతా ఇచ్చేయమంటారా?" ప్రశ్నించాడు రమణ.

ఇన్‌స్పెక్టరుకి విషయమంతా అర్థమైపోయింది.

"అడిగినంత ఎలా ఇస్తారండీ? అసలు మీటరు ఎందుకు లేదు?" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"ఆ విషయాన్ని ఈ డ్రైవర్నే అడగండి".

నిరంజన్ ఇన్‌స్పెక్టరు పక్కనే నిల్చున్నాడు. అతడి మొహం బాగా పాలిపోయి వుంది. కొద్దిసేపటి క్రితం వున్న విజయోత్సాహం అతనిలో ఇప్పుడు లేదు.

"ఏమోయ్! మీటరేమయ్యింది?" గర్జించాడు ఇన్‌స్పెక్టరు.

నిరంజన్ అహం దిగిపోయింది. ఏం చెప్పగలడు?

'అది...అది...' నసిగాడు.

"అంటే, కనెక్షన్ వూడబీకేశావన్నమాట! మీలో చాలా మందికి ఇప్పుడు ఇదో అలవాటుగా మారినట్టుంది. నిజాయితీగా నాలుగు రాళ్ళు సంపాదించుకోలేక, ఈ మోసాలెందుకయ్యా?" అంటూ రమణకేసి చూస్తూ-

"చూడండి సార్! మీరు ఎక్కడికి వెళ్ళాలి?"

'కలెక్టరాఫీసు వరకండీ" జవాబు చెప్పాడు రమణ.

"ఎక్కణ్ణించి వస్తున్నారు?"

"ఇసుక తోటనుంచండీ".

"ఎంత బాడుగ అడిగాడు?"

"పాతిక ఇమ్మన్నాడండీ! అడగటం మాట అటుంచండి. ఇష్టం వచ్చినట్టు మాట్లాడాడు సార్. మీటరు లేదేం అంటే మనుషులే వుండటం లేదు, మీటరు పాడైతే తప్పా! అన్నాడు. మాకు స్కూటరైనా లేదన్నాడు. అసలు, మాకు ఆటోలో ప్రయాణం చేసే అలవాటే లేదన్నాడు. ఒకటేమిటి సార్...నన్ను రెచ్చగొట్టే విధంగా ఏవేవో అన్నాడు. సహనం వున్నవాణ్ణి కాబట్టి సరిపోయిందండీ. మరొకడైతే...." అంటూ క్లుప్తంగా చెప్పాడు రమణ.

ఇన్‌స్పెక్టరు తీక్షణంగా నిరంజన్ వైపు చూశాడు.

"ఏవిటోయ్! అంత మొనగాడివైపోయావా? మీలాంటి వాళ్ళ వల్లనే కదా, ఆటో డ్రైవర్లందరికీ చెడ్డ పేరొస్తోంది! మీలో ఎంతమంది మంచి వాళ్ళు లేరు? వాళ్ళని చూసయినా నేర్చుకో. ఔను, కలెక్టరాఫీసుకి పాతిక రూపాయలిమ్మన్నావా?" కళ్ళెర్రజేస్తూ అడిగాడు ఇన్‌స్పెక్టర్.

నిరంజన్ తలతిక్క కుదిరింది. అతనిలో భయాందోళనలు అధికమైనయ్. ఇన్‌స్పెక్టర్ కేసు రాస్తే కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుందన్న భయం అతణ్ణి కలవరపర్చింది.

"తప్పయింది సార్! ఈసారికి క్షమించండి. వీళ్ళ దగ్గర పైసా కూడా తీసుకోకుండా తీసుకెళ్తాను సార్" ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

ఇన్‌స్పెక్టరు విషయాన్ని మరింత జటిలం చేయటం ఇష్టం లేక రమణకేసి తిరిగాడు.

"విన్నారు కదండీ! అంత అధికంగా బాడుగ అడిగినందుకు అతను పశ్చాత్తాప పడుతున్నాడు. అతణ్ణి క్షమించేయండి. మీరు వెళ్ళాల్సిన చోటుకి వూరికనే తీసుకెళ్తానంటున్నాడు. అతని ఆటో నెంబర్ నోట్ చేసుకుంటున్నాను. మళ్ళీ ఏ విధమైన కూతలు కూసినా నాకు చెప్పండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ భరోసాగా.

నిజానికి ఇన్‌స్పెక్టర్ చాలా మంచివాడు కాబట్టి సామరస్యానికి ప్రయత్నించాడు. అయితే రమణకి మాత్రం ఆ ఆటోలోనే ప్రయాణించడం ఇష్టం లేకపోయింది.

"మీ మంచితనానికి ధన్యవాదాలు సార్. అయితే మీరు కోరినట్టుగా ఇదే ఆటోలో వెళ్ళను. ఎందకంటే అతని తలబిరుసు చూస్తూ వుంటే కావాలని యాక్సిడెంటు చేసి మమ్మల్ని గాయపర్చినా గాయపరుస్తాడు. మరో ఆటో చూసుకుంటాం లెండి. ఇదిగోండి...మినిమమ్ ఛార్జ ఇస్తున్నాను" అంటూ జేబులోంచి ఆర్రూపాయిలు తీసిచ్చాడు డ్రైవరుకి.

నిరంజన్ పల్లెత్తు మాట అనలేదు.

"దిగు రాధికా" అన్నాడు రమణ.

రాధిక ఆటోలోంచి దిగింది. ఆమెకి ఇప్పుడెంతో తృప్తిగా వుంది ఏవిధమైన గొడవా జరగనందుకు.

ఇన్‌స్పెక్టర్ రమణ భయాన్ని అవగతం చేసుకున్నాడు.

"సరే! మీ ఇష్టమండీ! ఇదిగోండి ఖాళీ ఆటో వస్తోంది. అందులో వెళ్ళండి" అన్నాడు దాన్ని ఆపుతూ.

'చాలా థ్యాంక్స్ సార్!" కృతజ్ఞతలు చెప్పుకున్నాడు రమణ.

"ఇట్స్ మై డ్యూటీ. వెళ్ళిరండి" మెల్లగా నవ్వుతూ అన్నాడు ఇన్‌స్పెక్టర్.

రమణ దంపతులు ఆ ఖాళీ ఆటోలో చని వెళ్ళిపోయారు.

నిరంజన్ అక్కడే నిల్చున్నాడు.

"సార్...మరి నేను" అన్నాడు భయంగా.

"ఈ సారికి క్షమించి వదిలేస్తున్నాను. ఇకనైనా బుద్ధి తెచ్చుకుని మంచిని అలవర్చుకో. వెళ్ళు" మందలిస్తూ వదిలిపెట్టాడు ఇన్‌స్పెక్టర్.

"అలాగే సార్" ఇన్‌స్పెక్టరుకి ముకుళిత హస్తాలతో నమస్కరిస్తూ వెళ్ళిపోయాడు నిరంజన్.

అతనిలో మార్పు వచ్చినట్టు అతని మొహమే చెబుతోంది.